## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

నిరంతర వార్తా ప్రవాహం

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:345 | సోమవారం జూలై 20, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


## 'వందేమాతరం' గేయాన్ని అవమానిస్తే..
## మూడేళ్ల జైలు!



2లో

- 'వందేమాతరం' అవమానిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష ప్రతిపాదన
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో సవరణ బిల్లు ప్రవేశపెట్టనున్న కేంద్రం
- రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- 1971 జాతీయ గౌరవ చట్టంలో 'వందేమాతరం'ను చేర్చనున్న ప్రభుత్వం
- 'జన గణ మన'తో సమాన హోదా కల్పించడమే బిల్లు లక్ష్యం
- 'వందేమాతరం' రచయిత బంకించంద్ర ఛటర్జీ; 'ఆనంద్ మఠ్' నవలలో తొలిసారి ప్రచురితం

## ఫిఫా ప్రపంచకప్ ఫైనల్..
## కేరళ, మణిపుర్ పాఠశాలలకు సెలవు



2లో

- ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ సందర్భంగా కేరళ, మణిపుర్‌లో విద్యాసంస్థలకు సెలవు
- అర్జెంటీనా-స్పెయిన్ ఫైనల్ మ్యాచ్ కోసం విద్యార్థుల విజ్ఞప్తికి ప్రభుత్వాల ఆమోదం
- కేరళలో జనరల్ ఎడ్యుకేషన్ శాఖ పరిధిలోని అన్ని పాఠశాలలకు సెలవు
- మ్యాచ్ సమయంలో నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు
- మణిపుర్‌లో పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు కూడా సెలవు
- ప్రపంచకప్ ఫైనల్‌ను విద్యార్థులు వీక్షించేందుకు ప్రత్యేక నిర్ణయం

## రూ.కోట్ల విలువైన భూమి కబ్జాకు యత్నం..

**తమ్మినేని సహా కుటుంబసభ్యులపై కేసు**



ఓ భూ వ్యవహారంలో వైకాపా నేత, శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తో పాటు ఆయన కుటుంబసభ్యులపై శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పేజి 2లో ▶

## బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగాలు ఇవ్వకుండా ఎవరు అడ్డుకున్నారు?: శ్రీధర్‌బాబు



కరీంనగర్: ప్రతి జిల్లాలో ఎల్‌నినో సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలపై ప్రణాళికను రూపొందించి అమలు చేస్తామని చెప్పారు. పేజి 2లో ▶

## దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు..
## తస్మాత్ జాగ్రత్త!

- మళ్లీ కరోనా కలకలం
- ఏపీ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో పెరుగుతున్న కేసులు

2లో



## ఆగస్టు 3 వరకు నేతలు గాంధీభవన్‌కు రావొద్దు: సీఎం రేవంత్‌రెడ్డి



**పదవుల కోసం వచ్చే వారికి అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దని స్పష్టమైన ఆదేశాలు**

- ఆగస్టు 3 వరకు నేతలు గాంధీభవన్‌కు రావొద్దని సూచన.
- పదవుల కోసం వచ్చే వారికి అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దని ఆదేశం.
- ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లాల వారీగా సమీక్షలు.
- వచ్చే 10 రోజులు నియోజకవర్గాల్లోనే పనిచేయాలని నేతలకు సూచన.

పదవుల కోసం గాంధీభవన్‌కు వచ్చే వారికి అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ ముఖ్య నేతలకు సూచించారు. ఎస్ఐఆర్‌పై నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రేపటి నుంచి ఆగస్టు 3 వరకు నేతలు గాంధీభవన్‌కు రావొద్దని, పూర్తిగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. కొందరు నేతలు హైదరాబాద్‌లోనే ఉండి ప్రజల్లోకి వెళ్లడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ గడువు ఆగస్టు 3 వరకు పొడిగించబడిందని, ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పార్టీ ఇన్‌ఛార్జిలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.





"పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండండి.. హైదరాబాద్ చుట్టూ తిరుగుతూ సమయం వృథా చేయొద్దు."

### సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

- ఆగస్టు 3 వరకు నేతలు గాంధీభవన్‌కు రావొద్దు.
- పదవుల కోసం వచ్చే వారికి అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దు.
- 119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో 489 సమావేశాలు జరిగాయి.
- ఇన్‌ఛార్జి మంత్రులు అన్ని జిల్లాల్లో ఎస్ఐఆర్‌పై సమీక్షలు నిర్వహిస్తారు.
- వచ్చే 10 రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో నియోజకవర్గాల్లో పర్యటించాలి.
- హైదరాబాద్‌లో కాకుండా క్షేత్రస్థాయిలోనే ఉండి పనిచేయాలి.
- బీఎల్‌వోల నివేదికల కంటే బీఎల్‌ఏల నివేదికలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- బాగా పనిచేసే 100 మంది బీఎల్‌ఏలకు రాహుల్ గాంధీతో ఫొటో దిగే అవకాశం కల్పిస్తామని తెలిపారు.

## తెలుగు సినిమా మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి: సీఎం చంద్రబాబు




- సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది.
- ప్రపంచ స్థాయిలో తెలుగు సినిమా మరింత గుర్తింపు పొందాలి.
- సాంకేతికత, సృజనాత్మకతతో కొత్త తరానికి అవకాశాలు కల్పించాలి.

అమరావతి: 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల విజేతలందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు (జష్ఠ్రుఅఎత్ఝుఝుఎబ) అభినందనలు తెలిపారు. సినిమా కీర్తిని మరింత పెంచి, తెలుగు చలనచిత్ర పరిశ్రమకు ఎనలేని గర్వకారణంగా నిలిచిన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు, చిత్ర బృంద సభ్యులందరినీ ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు చెప్పారు. కళ, సంస్కృతి, సినిమా మన గుర్తింపునకు, వారసత్వానికి బలమైన స్తంభాలని సీఎం వ్యాఖ్యానించారు. తెలుగు సినిమా మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ, తన ప్రతిభతో రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. అవార్డు గ్రహీతలందరికీ భవిష్యత్తులో మరిన్ని విజయాలు, మరెన్నో ప్రశంసలు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ బెస్ట్ విషెస్ తెలిపారు. 72వ జాతీయ చలన చిత్ర పురస్కార విజేతలను సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. నిహారిక కొణిదెల నిర్మించిన కమిటీ కుర్రోళ్లు ఉత్తమ చిత్రంగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. నేషనల్ ఫిలిమ్స్‌లో 9 అవార్డులతో టాలీవుడ్ సత్తా చూపించడం గర్వంగా ఉందని దుర్గేష్ హర్షం వ్యక్తంచేశారు. కథ, నటన, సాంకేతిక నైపుణ్యం, కాస్ట్యూమ్ డిజైనింగ్, మేకప్, నిర్మాణ విలువలు ఇలా అన్ని విభాగాల్లో తెలుగు సినిమా ప్రతిభ చాటిందని కొనియడారు.

### సీఎం చంద్రబాబు ముఖ్యాంశాలు

- తెలుగు సినిమా గ్లోబల్ స్థాయిలో మరింత గుర్తింపు పొందాలి.
- కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకు సాగాలి.
- యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు పెంచాలి.
- ప్రభుత్వం నుంచి సినీ పరిశ్రమకు నిరంతర సహకారం ఉంటుంది.

## జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం



2లో

## వ్యక్తిత్వ హననం కట్టడికి పార్లమెంట్‌లో చట్టం తేవాలి: లావు శ్రీకృష్ణదేవరాయలు



2లో

# సంపాదకీయం

## ఆదర్శం విడిచి.. అరాచకం వైపు!

నాయకుడు ప్రజలకు ఆదర్శంగా ఉండాలా? ప్రజలే నాయకుడికి ఆదర్శంగా ఉండాలా? ప్రజలను ముందుండి నడిపించేవాడే నాయకుడు కనుక నాయకుడే ఆదర్శంగా ఉండాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో మన నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండేవారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి నాయకులు చెప్పిన మాటలను ప్రజలు తూచా తప్పకుండా ఆచరించేవారు. మహాత్మాగాంధీ ఒక్క పిలుపు ఇవ్వగానే మహిళలు ముందుకు వచ్చి తమ ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను విరాళంగా ఇవ్వడం మనకు తెలిసిందే. అప్పట్లో నాయకులపై ప్రజలకు అంత నమ్మకం ఉండేది. తాజాగా అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో బంగారం కొనుగోళ్లు చేయవద్దని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విజ్ఞప్తికి కూడా ప్రజలు స్పందించారు. దీంతో దేశంలో బంగారం వినియోగం తగ్గుతోంది. అయితే, కాలక్రమంలో రాజకీయ నాయకులపై ప్రజలకు నమ్మకం పోతోంది. నాయకులు చెప్పే మాటలను ప్రజలు పెద్దగా విశ్వసించడం లేదు. ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చిన హామీలు మాత్రమే ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. అంతులేని హామీల విషయంలో రాజనీతిజ్ఞత మాత్రం కనిపించడం లేదు. రాష్ట్రాలతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న ఉచిత పథకాలపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. అయితే పిల్లి మెడలో ఎవరు గంట కట్టాలి? అన్న ప్రశ్న వేధిస్తున్న సమయంలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో చోటుచేసుకున్న పరిణామం ఒకింత ఉపశమనం కలిగిస్తోంది. ఆ ఎన్నికల్లో సినీ నటుడు జోసెఫ్ విజయ్ ఏర్పాటు చేసిన టీవీకే పార్టీ అధికారంలోకి వచ్చింది. అభ్యర్థులు ఎవరో ఓటర్లకు తెలియదు. తమ ఓటర్లు ఎవరో, నియోజకవర్గాల సరిహద్దులు ఏమిటో అభ్యర్థులకు తెలియదు. ఓట్ల కొనుగోలుకు పైసా ఖర్చు చేయలేదు. అయినా మెజారిటీ స్థానాలలో టీవీకే అభ్యర్థులు విజయం సాధించారు. ఎన్నికల్లో గెలుపోటములను డబ్బు మాత్రమే ప్రభావితం చేయజాలదని తమిళనాడు ఎన్నికలు రుజువు చేశాయి. ఈ ఎన్నికల సందర్భంగా ఆదర్శంగా వ్యవహరించిన జోసెఫ్ విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా అంతే ఆదర్శంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి పదవిని ఒక బాధ్యతగా నిర్వహిస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు భోజనం క్యారియర్‌తో సచివాలయానికి వస్తున్న ముఖ్యమంత్రి... కార్యాలయ పనివేళలు ముగియగానే సాయంత్రం 5 గంటలకు ఇంటికి వెళ్లిపోతున్నారు. మనకు తెలిసిన రాజకీయాలలో జోసెఫ్ విజయ్ వ్యవహార శైలి వినూత్నంగా ఉంది. ప్రభుత్వంలో అవినీతికి స్థానం లేదని రుజువు చేయడానికి ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన తనను అభినందించడానికి వచ్చిన పారిశ్రామిక, వ్యాపారవేత్తలతో సీఎం విజయ్ డిప్లమాటిక్‌గా మెలుగుతున్నారు. వివిధ శాఖలలో టెండర్లు, ఇతరత్రా నిర్ణయాలు పారదర్శకంగా జరిగిపోతున్నాయి. టెండర్లు నిబంధనల ప్రకారం ఆటోమేటిగ్గా ఖరారవుతున్నాయి. లాలూచీలకు తావుండటం లేదు. అంతా ఆన్‌లైన్లో పారదర్శకంగా జరిగిపోతున్నాయి. ప్రభుత్వ అధికారులు లంచాలు డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేసే వెసులుబాటు కూడా కల్పించారు. రాష్ట్రాలలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా మద్యం కొనుగోళ్లలో అధికార పార్టీకి మామూళ్లు అందడం ఆనవాయితీగా వస్తోంది. తమిళనాడులో ఈ ధోరణికి కూడా ఇప్పుడు అడ్డుకట్ట వేశారు. అధికార పార్టీకి కమీషన్లు ఇచ్చేవారు ఆ మేరకు ప్రభుత్వానికి సరఫరా చేసే మద్యం ధరలు తగ్గించాలని ముఖ్యమంత్రి విజయ్ ఆదేశించారట! దీంతో ప్రభుత్వ కొనుగోలు ధర తగ్గి ఆదాయం పెరిగింది. ముఖ్యమంత్రి అండ చూసుకొని ప్రజలు కూడా ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులను ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. మొత్తం మీద జోసెఫ్ విజయ్ ప్రస్తుతం ఆదర్శ సీఎంగా పనిచేస్తున్నారు. ఫలితంగా ప్రజలకు ఆయనపై నమ్మకం మరింత పెరిగిందని చెబుతున్నారు. దండిగా డబ్బున్న వారికే పార్టీ టికెట్లు ఇవ్వడానికి అలవాటుపడిన రాజకీయ పార్టీలకు జోసెఫ్ ఆదర్శంగా నిలిచారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో రాజకీయాలు ఇంతే ఆదర్శంగా ఉండేవి.

**నాడు తెలుగు నాట...**

ఎన్టీఆర్ రాజకీయ రంగ ప్రవేశం చేశాక తెలుగునాట కూడా ఇటువంటి ఆదర్శ పోకడలను చూశాం. రాజకీయ నేపథ్యం లేని యువతీ యువకులకు ఎన్టీఆర్ టికెట్లు ఇచ్చి గెలిపించుకున్నారు. 1983లో తెలుగుదేశం పార్టీ టికెట్ పొందిన జీవన్‌రెడ్డి, ప్రతిభాభారతి, యనమల రామకృష్ణుడు వంటి వారు అతి స్వల్ప వ్యయంతో, అంటే పది నుంచి పదిహేను వేల రూపాయల ఖర్చుతో ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ తొమ్మిది నెలలకే అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించడమే కాకుండా ప్రభుత్వంలో అవినీతికి తావు లేకుండా చేశారు. మంత్రులు, శాసనసభ్యులు అవినీతికి పాల్పడాలంటే వణికిపోయేవారు. అప్పట్లో కూకట్‌పల్లి నుంచి గెలిచిన ఎం.రామచంద్రరావును కార్మిక శాఖ మంత్రిగా నియమించారు. ఆయన అవినీతికి పాల్పడుతున్నారని ఎన్టీఆర్‌కు సమాచారం అందింది. దీంతో సదరు మంత్రిపై నిఘా పెట్టవలసిందిగా అవినీతి నిరోధక శాఖను ఎన్టీఆర్ ఆదేశించారు. ఆ శాఖకు అప్పట్లో వి.అప్పారావు అధిపతిగా ఉండేవారు. ఎన్టీఆర్ ఆదేశాల మేరకు అవినీతి నిరోధక శాఖ అధికారులు వలపన్ని సచివాలయంలో మంత్రి రామచంద్రరావు పది వేల రూపాయలు తీసుకుంటుండగా నేరుగా పట్టుకున్నారు. లంచం తీసుకున్న కేసులో ఒక మంత్రిని పట్టుకోవడం అదే ప్రథమం. అప్పట్లో అదో సంచలనం. అయితే రాజకీయాల్లో ఆదర్శంగా ఉండటం అంత ఆషామాషీ కాదని తెలియడానికి ఎన్టీఆర్ అంతటి నాయకుడికీ ఎంతో కాలం పట్టలేదు. ఈ సంఘటన జరిగిన కొంత కాలానికే నాదెండ్ల భాస్కరరావు రూపంలో ఎమ్మెల్యేలు సంఘటితమై అప్రజాస్వామికంగా ఎన్టీఆర్‌ను గద్దె దించారు. ఆ తర్వాత జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం, ఎన్టీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఎంత కాలం నిక్కచ్చిగా రాజకీయాలు చేయగలరో వేచి చూడాలి. రాజకీయాల్లో డబ్బు ప్రభావం లేని రోజుల్లోనే నిజాయితీగా ప్రభుత్వాన్ని నడపడం కష్టతరమని ఎన్టీఆర్ ఉదంతంలో రుజువైంది. ఇప్పుడు అవినీతి ప్రజల దైనందిన జీవితంలో భాగమైపోయింది. రాజకీయాల్లో కూడా అవినీతి ఒక భాగమైంది. ప్రజలు కూడా అవినీతిని పట్టించుకోవడం లేదు. దానికి అలవాటు పడిపోయారు. ఎన్టీఆర్ తర్వాత రాజకీయాల్లో మార్పు సాధ్యమని జోసెఫ్ విజయ్ నిరూపిస్తున్నారు. అయితే, ఇది ఎంత కాలం? అన్న ప్రశ్న ఉండనే ఉంది.

**వ్యవస్థీకృత అవినీతి**

ఎన్టీఆర్ తర్వాత రాజకీయాల్లో విలువలు క్రమంగా క్షీణిస్తూ వచ్చాయి. దేశవ్యాప్తంగా నెలకొన్న ఈ ధోరణి తెలుగు రాష్ట్రాలను కూడా కమ్మేసింది. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అవినీతి వ్యవస్థీకృతం అయింది. టెండర్ల వ్యవస్థకు నిర్వచనం మారిపోయింది. ప్రభుత్వ పెద్దలు ఎంపిక చేసిన వారికే టెండర్లు దక్కే విధానం అమల్లోకి వచ్చింది. టెండర్లు పొందిన వారు నాయకులకు ఆరు శాతం కమీషన్ ఇవ్వడం ఒక రకంగా చట్టబద్ధమైపోయింది. రాజశేఖరరెడ్డి అమలు చేసిన ఈ విధానం ఆ తర్వాత దేశంలోని అన్ని రాష్ట్రాలకూ విస్తరించింది. ఫలితంగా అవినీతి వ్యవస్థీకృతం అయింది. తెలుగునాట విలువల క్షీణత దాదాపు మూడు దశాబ్దాల క్రితమే మొదలైంది. అయితే రాజకీయ వైషమ్యాలు ఒక స్థాయికి మించి దిగజారలేదు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావానికి ముందు కాంగ్రెస్‌కు కాంగ్రెస్ పార్టీయే ప్రధాన ప్రత్యర్థిగా ఉండేది. తెలుగుదేశం పార్టీ ఏర్పాటు తర్వాత రాజకీయాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం మొదలైంది. కులాలను కూడా రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. ఈ పాపానికి కాంగ్రెస్ నాయకులే కారణం. అప్పటి నుంచీ తెలుగునాట కులాల కుంపట్లు రాజుకున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత పరిస్థితి మరింత వికటించింది. తెలంగాణలో కులాల రొచ్చు ఉండేది కాదు. అలాంటిది ఇప్పుడు తెలంగాణలో కూడా ఈ జాడ్యం విస్తరిస్తోంది. నాయకుల మధ్య వైషమ్యాలు పెరిగిపోయాయి. రాజకీయ విభేదాల స్థానంలో వ్యక్తిగత కక్షలు రంగప్రవేశం చేశాయి. తెలంగాణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మధ్య వ్యక్తిగత స్థాయిలో వైరం ఏర్పడింది. ఇరుపక్షాలు కళ్లలో కళ్లు పెట్టి చూసుకోలేని పరిస్థితి. ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు మరింత దిగజారాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు--మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి.

## బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగాలు ఇవ్వకుండా ఎవరు అడ్డుకున్నారు?: శ్రీధర్‌బాబు

మొదటిపేజీ తరువాయి

కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం, తాగునీరు, వైద్యం, విద్యుత్, విపత్తు నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు మంత్రులు దిశానిర్దేశం చేశారు. సమీక్ష అనంతరం శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. "సాగునీటి విషయంలో మాకు ఎలాంటి భేషజాలు లేవు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) చెప్తే తప్పకుండా మేడిగడ్డ, కన్నెపల్లి నుంచి నీళు ఎత్తిపోస్తాం. ఒక్కరోజు లక్ష క్యూసెక్కులు రాగానే విపక్ష నేతలు గోల చేశారు. ప్రస్తుతం గోదావరిలో 16వేల క్యూసెక్కుల వరద కూడా లేదు. యువతను కేటీఆర్ పక్కదోవ పట్టించే యత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 పరీక్షలు నిర్వహించలేదు. పదేళ్లు ఉద్యోగాలు ఇవ్వకుండా ఎవరైనా అడ్డుకున్నారా?రెండున్నరేళ్లలో 70వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పాం.. జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం"అని శ్రీధర్‌బాబు అన్నారు.

## దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు..

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కరోనా మహమ్మారి మళ్లీ జూలు విదుల్చుతోంది. ఏపీ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కరోనా లక్షణాలతో ఏపీలో నలుగురు మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు. వారంతా దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు మధుమేహం, దీర్ఘకాలంగా స్టెరాయిడ్లు తీసుకుంటున్నవారు, క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటున్న రోగులు, ఆస్తమా, సీవోపీడీ వంటివాటితో బాధపడుతున్నవారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని.. పిల్లలు, వృద్ధులు, గర్భిణుల విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కనిపిస్తున్న వైరస్ వేరియంట్‌ను గుర్తించేందుకు శాంపిళ్లను పుణె ల్యాబ్‌కు పంపారు. అయితే పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. కరోనా ఎండెమిక్ స్థాయిలో ఉండటం వల్ల వ్యాప్తి కూడా తక్కువగా ఉంటుందన్నారు.

**భయం వద్దు.. అప్రమత్తత అవసరం**

దక్షిణాది రాష్ట్రాల్లో కరోనా కేసులు నెమ్మదిగా పెరుగుతున్నాయి. తెలంగాణలో ఇంతవరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదు. గాంధీలో.. భారీసంఖ్యలో రోగులకు చికిత్స చేసిన అపార అనుభవం ఉంది. ఒకవేళ కేసులు పెరిగితే ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి.

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారిపై కరోనా ఎక్కువ ప్రభావం చూపుతుంది. ఇలాంటివారు గుంపుల్లోకి వెళితే మాస్క్ ధరించడం తప్పనిసరి. చేతి శుభ్రత పాటించాలి. ఎక్కువమంది గుమిగూడే చోటుకు వెళ్లకూడదు. అత్యవసరమైతే తప్ప.. ప్రయాణాలు వాయిదా వేసుకోవడం మంచిది. ఏడాదికి ఒకసారి ఫ్లూ, న్యూమోకోకల్ వ్యాక్సిన్లు తీసుకోవాలి. చిన్నపిల్లలు, వృద్ధులు తప్పకుండా ఈ టీకాలు తీసుకోవడం ద్వారా కరోనా నుంచి రక్షణ ఉంటుంది.

రోజూ కనీసం 45 నిమిషాలు వ్యాయామం చేయడం.. సరైన నిద్ర, నీళ్లు తాగడం, ఒత్తిడి తగ్గించుకోవడం, సమతుల ఆహారంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గకుండా చూసుకోవచ్చు. తీవ్రమైన జ్వరం, నొప్పులు, కడుపులో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, శరీరంలో ఆక్సిజన్ శాతం తగ్గడం లాంటి లక్షణాలు ఉంటే మాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రిలో చేర్పించాలి.

## వ్యక్తిత్వ హననం కట్టడికి పార్లమెంట్‌లో చట్టం తేవాలి: లావు శ్రీకృష్ణదేవరాయలు

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని.. కట్టడికి చట్టం కూడా తేవాలని కేంద్రాన్ని కోరినట్లు తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మ్యూల్ అకౌంట్లు, షెల్ కంపెనీలు, ఆన్‌లైన్ సైబర్ మోసాలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. సైబర్ మోసాలతో ప్రజలు పొదుపు సొమ్మును భారీగా కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష భేటీకి హాజరైన తర్వాత లావు శ్రీకృష్ణదేవరాయలు మీడియాతో మాట్లాడారు.

"తెదేపా తరఫున పలు జాతీయ, రాష్ట్ర అంశాలను అఖిలపక్ష భేటీలో ప్రస్తావించాం. దేశంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నదుల అనుసంధానంపై జాతీయ స్థాయిలో చర్చ జరపాలని విజ్ఞప్తి చేశాం. గోదావరి-పెన్నా అనుసంధాన ప్రాజెక్టును వేగవంతం చేయాలని, ఆక్వా రైతులకు ఫీడ్ వ్యయం తగ్గించే చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరాం. పశ్చిమాసియా సంక్షోభంతో ఆక్వా ఫీడ్ ముడిసరకు ధరలు పెరిగాయి. పొగాకు రైతులు ధరల పతనంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని కోరాం.

పోలవరం తొలి దశను 2027 మార్చి నాటికి పూర్తి చేయడమే ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పాం. 36 సాగునీటి ప్రాజెక్టులను 2029లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.60 వేల కోట్ల కేంద్ర సహకారం కోరాం. ఈసారి మహిళా రిజర్వేషన్ బిల్లుకు ప్రతిపక్షాలు కూడా మద్దతు ఇస్తాయని భావిస్తున్నాం. అమరావతి అభివృద్ధిని అడ్డుకునేందుకు వైకాపా ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్రంలోని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు మద్దతుగా ఉన్నారు. మతం, కులం పేరుతో హింసకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

## సులభ్ కాంప్లెక్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



పెబ్బేరు పట్టణం: శౌచాలయానికి వెళ్లిన నిండు గర్భిణి.. పురిటి నొప్పులు అధికమై అక్కడే మగబిడ్డను ప్రసవించిన ఘటన వనపర్తి జిల్లా పెబ్బేరులో ఆదివారం జరిగింది. జోగులాంబ గద్వాల జిల్లా బోరవెల్లి గ్రామానికి చెందిన గర్భిణి లావణ్య భర్త రాముడుతో కలిసి వ్యక్తిగత పని నిమిత్తం మహబూబ్‌నగర్‌కు బయలుదేరారు. మార్గంమధ్యలో పెబ్బేరు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు దిగిన ఆమె.. సులభ్ కాంప్లెక్స్‌లోని శౌచాలయానికి వెళ్లారు. ఈ సమయంలో ఆమెకు పురిటి నొప్పులు అధికమవడంతో అక్కడే మగబిడ్డను ప్రసవించారు. స్థానిక మహిళలు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో చేరుకున్న సిబ్బంది తల్లీబిడ్డకు ప్రాథమిక చికిత్స అందించి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

## 'వందేమాతరం' గేయాన్ని అవమానిస్తే..

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: జాతీయ గేయం 'వందేమాతరం'ని అవమానించినా, ఆలపిస్తున్న సమయంలో ఆటంకం కలిగించినా ఇకపై చట్టరీత్యా నేరంగా పరిగణించనున్నారు. ఈ మేరకు పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా తొలిరోజే (సోమవారం) ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్ టు నేషనల్ ఆనర్ (సవరణ)-2026' బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

1971 నాటి చట్టం ప్రకారం జాతీయ చిహ్నాలతోపాటు జాతీయ జెండా, రాజ్యాంగం, జాతీయ గీతాన్ని అవమానపరచడం చట్టరీత్యా నేరం. దీనికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష పడొచ్చు. తాజాగా ఆ చట్టానికి సవరణ చేయడం ద్వారా ఆ జాబితాలో 'వందేమాతరం' గేయాన్ని చేర్చనున్నారు. ఈ గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గతేడాది నవంబర్ 7 నుంచి ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే వందేమాతరానికి.. జాతీయ గీతం 'జన గణ మన'తో సమాన హోదా కల్పించేందుకు ప్రభుత్వం ఈ బిల్లు తీసుకొస్తోంది. ఈ గేయాన్ని బంకించంద్ర ఛటర్జీ రచించారు. తొలిసారి ఛటర్జీ రాసిన 'ఆనంద్ మఠ్' నవలలో ప్రచురితమైంది.

## ఫిఫా ప్రపంచకప్ ఫైనల్..

మొదటిపేజీ తరువాయి

కేరళ ప్రభుత్వం స్కూల్ పిల్లలకు శుభవార్త చెప్పింది. ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ సందర్భంగా సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటించింది. జనరల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ పరిధిలోని అన్ని పాఠశాలలకు ఈ నిర్ణయం వర్తిస్తుందని తెలిపింది. ఆదివారం రాత్రి అర్జెంటీనా-స్పెయిన్ మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. మ్యాచ్‌ను చూసేందుకు అవకాశం కల్పించాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరగా.. వారి విజ్ఞప్తిని ప్రభుత్వం అంగీకరించింది. విద్యాశాఖ మంత్రి ఎన్.షంసుద్దీన్ సోషల్ మీడియాలో ఈ విషయాన్ని ప్రకటించారు. "ఇప్పుడు సంతోషమేనా పిల్లలూ?" అంటూ ఆయన పోస్టు చేశారు.

మరోవైపు.. మణిపుర్ ప్రభుత్వం కూడా సోమవారం రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్, సీబీఎస్ఈ, ఇతర బోర్డులకు అనుబంధంగా ఉన్న అన్ని పాఠశాలలతో పాటు ప్రభుత్వ, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు జులై 20న మూసివేయాలని పేర్కొంది. ప్రపంచకప్ ఫైనల్‌ను రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఆస్వాదించేందుకు సెలవు ప్రకటించినట్లు ప్రభుత్వం తెలిపింది.

## రూ.కోట్ల విలువైన భూమి కబ్జాకు యత్నం..



మొదటిపేజీ తరువాయి

మధ్యవర్తిత్వం చేసిన వారితో పాటు మొత్తం 13 మందిపై కేసు నమోదవగా 8 మందిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. "శ్రీకాకుళంలోని బలగ పరిధి సర్వే నంబర్ 35/13లో ఉన్న రూ.3 -4కోట్ల విలువైన భూమి కబ్జాకు కొందరు యత్నించారు. ఈ భూమికి సంబంధించి 1992-1998 మధ్య కొన్ని అమ్మకాల లావాదేవీలు జరిగాయి. అంధవరపు గోవిందరాజులు అనే వ్యక్తి బతికి ఉండగానే చనిపోయినట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రం సృష్టించారు. ఒడిశాలోని జయపురకు చెందిన అడబాల రజనీని గోవిందరాజులు కుమార్తె అంధవరపు రజనీగా చూపించి తమ్మినేని చిరంజీవి నాగ్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. స్థలానికి ప్రహరీ నిర్మించే ప్రయత్నాన్ని అసలు యజమాని కుటుంబ సభ్యులు అడ్డుకుని పోలీసులను ఆశ్రయించడంతో నకిలీ పత్రాలు, తప్పుడు వారసత్వం సృష్టించడం, తప్పుడు రిజిష్ట్రేషన్ తదితర అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి**

ఈ వ్యవహారం వెనుక తమ్మినేని సీతారాం, ఆయన భార్య వాణి ఉన్నట్లు గుర్తించాం. ఈ కేసులో నిందితులుగా ఉన్న అడబాల రజనీ (A1), తెలుగు సతీష్ కుమార్ (A2), సలిపిల్లి లక్ష్మణరావు (A3), ముదాడ్ల ఉపేంద్ర కుమార్ (A8), జెగురిపాటి ఉపేంద్ర రావు (A9), మామిడి గోపాలకృష్ణ (A10), సాంబాన సాంబశివరావు (A11), కూన పెద్దిరాజు (A12)ను అరెస్ట్ చేశాం. త్రినాథ్ (A4 ), తమ్మినేని చిరంజీవి నాగ్ (A5), తమ్మినేని సీతారాం (A6), తమ్మినేని వాణి (A7), బొడ్డేపల్లి అరుణ (A13) (సబ్‌రిజిస్ట్రార్)పై దర్యాప్తు కొనసాగుతోంది. మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తాం" అని ఎస్పీ తెలిపారు.

## జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రాజేంద్రనగర్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం రేగింది. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి తనను వేధిస్తున్నారంటూ కర్ణాటకకు చెందిన ట్రైనీ మహిళా ఐపీఎస్ అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

"ఉదయ్ కృష్ణారెడ్డి అసభ్యకర మెసేజ్‌లు పంపాడు. నా ఫోన్ లాక్కొని పాస్‌వర్డ్ చెప్పాలని బెదిరించాడు. గదిలో బంధించి జుట్టు పట్టుకుని దాడి చేశాడు. మెడకు కత్తిపెట్టి బెదిరించాడు. శారీరకంగా వేధించి అసభ్యకరంగా ప్రవర్తించాడు. అనుమతి లేకుండా ప్రైవేట్ వీడియోలు తీశాడు. ఆ వీడియోలను నా భర్తకు పంపిస్తానని బ్లాక్‌మెయిల్ చేశాడు" అని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు 74, 75, 77, 78, 79, 127(2), 115(2), 351(2), బీఎన్ఎస్, 66ఈ, 67ఏ ఐటీఏ యాక్ట్ 2008 సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రైతులంతా ఏకమై ఒకే నిర్ణయంతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి,

- వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం
- ఎల్ నినో ప్రభావాన్ని సమిష్టిగా ఎదుర్కొందాం...
- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 19, 2026: తెలంగాణ**





రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావాన్ని సమిష్టిగా ఎదుర్కొందామని, రైతులంతా ఏకమై ఒకే నిర్ణయంతో వరి మినహా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ఆదివారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో గల మైనారిటీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ కుమార్ తివారి, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగు మినహా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు 40 శాతం మాత్రమే వర్షపాతం నమోదు అయిందని, రాబోవు 3 నెలల లో కూడా ఈ పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని, ఇది ఒక ప్రకృతి విపత్తు లాంటిదని తెలిపారు. సాగునీరు, త్రాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని, ఈ కారణంగా ఈసారి నీటి లభ్యతలో లోటు ఉండడంతో వరి సాగులో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. నీటి ఇబ్బంది కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని, ఒకే నిర్ణయంతో ఈ సీజన్ లో వరి సాగు చేయవద్దని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో రాబోవు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలో లోటు వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని, నవంబర్ నెలలో వర్షం కురిసే అవకాశం ఉన్నా పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. భూగర్భ జలం తక్కువగా ఉందని, రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని, పప్పుధాన్యాలు, పత్తి, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి నీరు తక్కువ అవసరం ఉన్న పంటలు సాగు చేయాలని, అవసరమైన రాయితీ విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తక్కువ సమయంలో పంట చేతికి వచ్చే తక్కువ నీటి అవసరం ఉన్న పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని, వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని గ్రామాలలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు వివరించడం జరుగుతుందని తెలిపారు. మండలాలు, గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి ఆదాయం వచ్చే పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, వరి సాగు కారణంగా నష్టం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. భూసార పరీక్షలు నిర్వహించి కార్డులు అందించడం జరుగుతుందని, పంట సాగుకు అనుగుణంగా యూరియా అందించడం జరుగుతుందని తెలిపారు. జూన్ మాసంలో రైతు భరోసా అందించడం జరిగిందని, రైతులు మార్కెట్ లో డిమాండ్ ఉన్న ఆదాయం వచ్చే పంటలు సాగు చేసి లబ్ధి పొందాలని తెలిపారు.

## చెన్నూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తాం

చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో కొత్తగూడెం జంక్షన్ నుండి రావిచెట్టు పెద్ద చెరువు) జంక్షన్ వరకు 1 కోటి 40 లక్షల రూపాయల డి.ఎం.ఎఫ్.టి. నిధులతో నిర్మించిన బైపాస్ సి.సి. రోడ్డును జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, చైర్ పర్సన్, మార్కెట్ కమిటీ చైర్మన్ లతో కలిసి రాష్ట్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గంలో ప్రజల సౌకర్యార్థం రహదారులు, మురుగునీటి వ్యవస్థ, అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. పనులు ఉన్న ప్రాంతాలలో పనులను గుర్తించి, మంజూరు చేసి, పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన రహదారి విస్తరణ పనులకు వ్యాపారస్తులు స్వచ్ఛందంగా సహకరించడం అభినందనీయమని, పట్టణ అభివృద్ధిలో పాలు పంచుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. 6 కోట్ల 50 లక్షల రూపాయల పుష్కరాల నిధులు మంజూరు చేసి రహదారి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 1 కోటి 20 లక్షల రూపాయల డి.ఎం.ఎఫ్.టి. నిధులతో 20 షాపులను నిర్మించి నిరుపేద అర్హులైన వ్యాపారస్తులకు కేటాయించడం జరుగుతుందని, రోడ్డు విస్తరణలో భూమి కోల్పోయిన నిజమైన వ్యాపారస్తులకు 50 మందికి షాపులు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పట్టణంలోని శివాలయం ప్రాంతాన్ని అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్ది చెన్నూర్ పట్టణానికి బహుమతిగా ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని వార్డులలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అంతర్గత రహదారులను పూర్తిస్థాయిలో నిర్మించడం జరుగుతుందని తెలిపారు. సంక్షేమ సతి గృహాలలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ బైపాస్ రోడ్డు నిర్మాణంతో చెన్నూర్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని తెలిపారు. సి.సి. రోడ్లు, మురుగునీటి వ్యవస్థ అభివృద్ధి, త్రాగునీరు, సోలార్ లైటింగ్ సిస్టం ఏర్పాటు పనులను వేగంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ పట్టణంలో చేపట్టిన వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చేపట్టిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులు తుది దశకు చేరుకున్నాయని, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రజలకు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం చెన్నూర్ పట్టణంలోని మైనారిటీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం, విద్యాబోధన, పారిశుద్ధ్యం ఇతర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ద్వారకాతిరుమల ఆలయ పరిసరాల్లో వీధికుక్కల బీభత్సం.





- భక్తుల భద్రత గాలికే.. అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం.

**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జులై 19 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయం ఇప్పుడు వీధికుక్కల భయంతో వణికిపోతోంది. పవిత్రమైన ఆలయ ప్రాంగణం, క్యూ కాంప్లెక్స్ మరియు మెట్ల మార్గంలో వీధికుక్కలు చేస్తున్న బీభత్సం భక్తులకు నిద్రలేకుండా చేస్తోంది. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులు, ముఖ్యంగా మహిళలు, చిన్నారులు కుక్కల గుంపులను చూసి బెంబేలెత్తిపోతున్నారు. మెట్ల మార్గంలో నడిచి వెళ్లే వారిని వెంబడించడం, పాదాల మండపం వద్ద భక్తులు కూర్చున్నప్పుడు కుక్కలు దూకుడుగా వ్యవహరించడం పట్ల భక్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా తయారైందని, ఒంటరిగా వెళ్లాలంటేనే భయమేస్తోందని భక్తులు వాపోతున్నారు. ఆలయ పవిత్రతను కాపాడాల్సిన చోట, వీధికుక్కలు మలమూత్ర విసర్జన చేయడం వల్ల దుర్వాసన వస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఆధ్యాత్మిక భావంతో వచ్చే భక్తులకు, ఈ అపరిశుభ్ర వాతావరణం అసహనాన్ని కలిగిస్తోంది. కొందరు భక్తులు విచక్షణారహితంగా ఆహారం పడేయడం వల్ల ఈ కుక్కలు ఆలయ పరిసరాలనే శాశ్వత స్థావరాలుగా మార్చుకున్నాయని తెలుస్తోంది. వారానికి వేలాది మంది భక్తులు వచ్చే ఈ పుణ్యక్షేత్రంలో, కనీస భద్రతా చర్యలు లేకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే గానీ అధికారులు మేల్కొనరా?" అని భక్తులు నిలదీస్తున్నారు. పంచాయతీ, ఆలయ అధికారులు , ఇప్పటికైనా సమన్వయంతో స్పందించి, కుక్కల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, భక్తుల రక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

# చిన్న వెంకన్న సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి.

**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 19 ద్వారకాతిరుమల ప్రతినిధి.**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి , పశ్చిమగోదావరి జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ కట్టుల శ్రీనివాస రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం ఆలయానికి విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, పండితులు తూర్పు వైపు గాలిగోపురం వద్ద ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు .స్వామివారి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనాలు, స్వామివారి ప్రసాదాలను ,శేష వస్త్రాన్ని సమర్పించారు.ఏఈవో మెట్టపల్లి దుర్గారావు స్వామివారి జ్ఞాపికను అందించారు. వీరితోపాటు ఆలయ అధికారులు,సూపర్నెంట్ జి సుబ్రమణ్యం, అర్చకులు , ఎస్సై టి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులు మెచ్చేలా గోదావరి పుష్కరాల నాటికిరామాలయం పునరుద్ధరణడ పుష్కరపనులు పనులు పూర్తి అవుతాయి.

- రెవెన్యూ మంత్రి పొంగిలేటి.
- శనివారం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్న రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అనంతరం ప్రింట్, ఎలక్ట్రానిక్
- మీడియా వారితో మాట్లాడారు

**జనసముద్రంన్యూస్ జూలై 19 బ్యూరో చీఫ్ టెంపుల్ టౌన్ భద్రాచలం.**



తెలంగాణ ప్రజాప్రభుత్వం తొలి దశ రూ.351 కోట్లతో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆలయ పునరాభివృద్ధి పనులను మంత్రి గారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మాడవీధుల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలు సమయానికి పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా నిర్దీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు మంత్రిగారు సూచించారు. శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆశీస్సులతో అనుకున్న సమయానికి ఆలయ అభివృద్ధి పూర్తి కావాలని ఆకాంక్షించారు.

ఈకార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు గారు, తెల్లం వెంకట్రావు గారు, కలెక్టర్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, స్తపతి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ ఈవో, పండితులు, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా మాధవిధులను, శ్రీరామ మాడ పేరుతో శ్రీరామ మాడవీధులుగా నామకరణం చేయాలని రామభక్తులు కోరుతున్నారు.

# భద్రాచలంరామాల యంలోఆస్థాన పురోహితునిగా గత సాంప్రదాయం ప్రకారంవైదిక బ్రాహ్మణుని మాత్రమే నియమించండి.

- రెవెన్యూ మంత్రి పొంగులేటికి బ్రాహ్మణసంఘాల విజ్ఞప్తి.

**జనసముద్రం న్యూస్ జూలై 19 బ్యూరో చీఫ్ టెంపుల్ టౌన్ భద్రాచలం.**





భద్రాచలం రామాలయ అభివృద్ధి పనులు సమీక్షించుట కొరకు భద్రాద్రి వచ్చిన రెవెన్యూ మంత్రిని కలసి విజ్ఞాపన పత్రం సమర్పించిన పురోహితులు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో వందల సంవత్సరాలుగా ఆస్థాన పురోహితులుగా వైదిక బ్రాహ్మణ సమాజానికి చెందిన వారే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, సుమారు 4 నాలుగు సంవత్సరాలకుపూ ర్వం, ఆస్థాన పురోహితులు వెంకటేశ్వర అవధాని పదవి విరమణ (రిటైర్) చేశారని అత్యంత ప్రాధాన్యమైన ఆస్థాన పురోహితుని పోస్ట్ పిలప్ చేయకుండా కాలం వెళ్ళబుచ్చడంలో కుట్ర దాగి ఉన్నదని సందేహించాల్సి వస్తోందని, వైదిక బ్రాహ్మణ అభ్యర్థిని ఎంపిక చేయాల్సిన ఆస్థాన పురోహితుని పోస్టుకు ఇందుకు భిన్నంగా వేరొకరిని నియమించడంతో స్వార్థపరుల కుట్రలు బయటపడ్డాయని, దీంతో రాష్ట్రంలోని లక్షలదిమంది వైదిక బ్రాహ్మణ సమాజం వారు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పురోహితునిగా ఎంపికైన వ్యక్తి మరొక పోస్ట్ కు కూడా ఎన్నికైనట్లు నియామక ఉత్తర్వులలో పేర్కొనడం జరిగిందని పురోహితులు తెలిపారు.

దివ్య ప్రబంధ పారాయణం పోస్టులో చక్రవర్తుల వెంకట రఘు పుంగవను ఆపోస్టులోనే ఉంచి గత సాంప్రదాయం ప్రకారం అన్ని అర్హతలు ఉన్న వైదిక బ్రాహ్మణుని ఆస్థాన పురోహితునిగా నియమిం చే విధంగా చర్యలు తీసుకోవాలని

బ్రాహ్మణ శ్రేయోభిలాషి అయిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి పురోహితులు వినతి పత్రం సమర్పించారు.

వైదిక బ్రాహ్మణులకు న్యాయం చేసి రాష్ట్ర ప్రభుత్వం కోట్లాదిమంది వైదిక బ్రాహ్మణుల శుభాశీస్సులు పొందాలని బ్రాహ్మణ సంఘాల వారు విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞాన పత్రం సమర్పణలో గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామా వజ్జల.రవికుమార్ భద్రాద్రిబ్రాహ్మణ రోహిత సంఘం ప్రధాన కార్యదర్శి రాయప్రోలు పవన్ కుమార్ శర్మ, ఉపాధ్యక్షులు సిరిపురపు అశోక్ కుమార్ శర్మ, ఈసీ మెంబర్స్ కాదంబరి కృష్ణ శర్మ, సౌమిత్రి శేషాచార్యులు, బుక్కపట్నం. రామాచార్యులు, ఆర్ మహేష్ శర్మ మొదలగువారు పాల్గొన్నారు.

# కాకతీయ యూనివర్సిటీలో ఉచిత వైద్య శిబిరం

- కాకతీయ యూనివర్సిటీ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ సహకారంతో
- 150 మందికి రక్తంలో చక్కెర, బీపీ పరీక్షలు

**హనుమకొండ, జూలై 19 (జనసముద్రం)**





కాకతీయ యూనివర్సిటీ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ సహకారంతో సిరి మెడికేర్, థైరోకేర్ ఆధ్వర్యంలో ఆదివారం కాకతీయ యూనివర్సిటీ గ్రౌండ్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తంలో చక్కెర (బ్లడ్ షుగర్), రక్తపోటు (బీపీ) పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్, విటమిన్ డి3, విటమిన్ బి12, హార్ట్ అటాక్ రిస్క్, ఆరోగ్యం ప్రొఫైల్ వంటి పలు పరీక్షలను 50 నుంచి 70 శాతం రాయితీతో అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. పుల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎన్. రాము, గౌరవ అధ్యక్షుడు వి.నందయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. థైరోకేర్ ఫ్రాంచైజీ మేనేజర్ చేత్లపల్లి నరేందర్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించగా, ల్యాబ్ టెక్నీషియన్లు సురేష్, శ్రవణ్ సేవలు అందించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 150 మంది రక్తంలో చక్కెర, బీపీ పరీక్షలు చేయించుకుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమం అనంతరం థైరోకేర్ ఫ్రాంచైజీ మేనేజర్ నరేందర్‌ను అసోసియేషన్ అధ్యక్షుడు డా. పుల్ల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు వి. నందయ్య సన్మానించారు. ఈ సందర్భంగా డా. పుల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. థైరోకేర్ ఫ్రాంచైజీ మేనేజర్ చేత్లపల్లి నరేందర్ మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన కాకతీయ యూనివర్సిటీ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. పుల్ల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు వి. నందయ్యతో పాటు అసోసియేషన్ సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# కష్టాల్లో ఉన్నవారికి 'ఆపద్బాంధవుడు' మద్దిపాటి వెంకటరాజు.

## బాధిత కుటుంబానికి భరోసా కల్పించిన ఎమ్మెల్యే.

**జనసముద్ర న్యూస్ ఏలూరు జిల్లా జులై 19 ద్వారకాతిరుమల ప్రతినిధి.**



ప్రజా సమస్యల పరిష్కారంలోనూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడంలోనూ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు గారు తనదైన ముద్ర వేస్తున్నారు. తాజాగా, ద్వారకాతిరుమల మండలం ఐ.ఎస్. రాఘవాపురం గ్రామానికి చెందిన రాజులపాటి రామకృష్ణ అనే వ్యక్తిని పరామర్శించిన తీరు ఆయనలోని మానవత్వాన్ని చాటి చెప్పింది. ప్రమాదవశాత్తు తాటి చెట్టు మీద నుంచి పడి తీవ్ర గాయాలపాలై, ప్రస్తుతం మంచానికే పరిమితమైన రామకృష్ణని ఎమ్మెల్యే స్వయంగా కలిశారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...బాధిత కుటుంబానికి తానున్నానని భరోసా ఇచ్చారు. రామకృష్ణకి అవసరమైన వైద్య ఖర్చులన్నీ తన సొంత నిధుల నుంచి భరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన ఇద్దరు పిల్లల చదువుల బాధ్యతను తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఉపాధి మార్గాలను కల్పిస్తానని భరోసా ఇచ్చారు. ఆపద అంటే అరక్షణం కూడా ఆలోచించకుండా, తక్షణమే స్పందించి అండగా నిలుస్తున్న మద్దిపాటి వెంకటరాజు నియోజకవర్గ ప్రజల పాలిట 'ఆపద్బాంధవుడు' అని గ్రామస్తులు కొనియాడారు. కష్టాల్లో ఉన్న రామకృష్ణకి గ్రామస్తులందరూ అండగా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల, గ్రామ స్థాయి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాచర్లలో నూతన శిశు వైద్యసదుపాయాలతో ఏ బి సి చిల్డ్రన్స్ హాస్పిటల్ పరిచయం --- శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ప్రారంభం

**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి జులై 19**

మాచర్ల నియోజకవర్గ శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదివారం నాడు మాచర్ల పట్టణంలో అత్యాధునిక సౌకర్యాలతో సమగ్ర శిశు వైద్యసేవలందించే ఏ బి సి చిల్డ్రన్స్ హాస్పిటల్‌ను ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతున్న అధికార వక్తలు, ఈ హాస్పిటల్ ద్వారా నవజాత శిశువుల నుండి 18 ఏళ్ల వరకు ఉన్న పిల్లల వరకు ఒకే చోటలో నాణ్యమైన వైద్యసేవలు అందించబడతాయని తెలిపారు. మాచర్ల ప్రజలకు స్థానికంగా అత్యాధునిక శిశు వైద్యం అందించగలనని ఎమ్మెల్యే భారీగా సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు హాస్పిటల్ బహు ప్రయోజనకరంగా ఉండాలని మరియు నిర్వాహకులు సేవ భావంతో ముందుకు సాగాలని ఆయన కోరారు.

హాస్పిటల్ నిర్వహణం తెలిపిన వివరాల ప్రకారం, ఏ బి సి చిల్డ్రన్స్ హాస్పిటల్లో 0 నుంచి 18 సంవత్సరాల వయస్సు పిల్లలకోసం సమగ్ర వైద్యసేవలు అందించబడతాయి. ముఖ్య



సదుపాయాలు: 24/7 అత్యవసర శిశు వైద్యసేవలు, ఎన్ఐసియు , పిఐసియు , నవజాత శిశువుల ప్రత్యేక చికిత్స, టీకాల కేంద్రం, సాధారణ మరియు ప్రత్యేక పిల్లల వైద్య సేవలు; ఇవన్నీ ఆధునిక పరికరాల ద్వారా వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి. ఆసుపత్రి వైద్య ఏర్పాట్లకు డాక్టర్ పద్మజా రెడ్డి నాయకత్వం వహిస్తున్నట్లు యాజమాన్యం వెల్లడించింది.

హాస్పిటల్ మేనేజింగ్ పార్ట్నర్స్ డాక్టర్ గుర్రం రాజశేఖర్ రెడ్డి (ఎమ్.డి., జెనరల్ మెడిసిన్) మరియు జున్నా చక్రధర్ రెడ్డి (డైరెక్టర్, న్యూట్రిషన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్)



మాట్లాడుతూ మాచర్లకు మరియు పరిసర ప్రాంతాల చిన్నారులకు 24 గంటలపాటు ఆధునిక, నాణ్యమైన శిశు వైద్యసేవలు అందించడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి ఉత్తమ వైద్యం అందించడం కోసం వారి వైద్య సిబ్బంది ఎప్పుడూ అంకితభావంతో అందుబాటులో ఉంటారని వారు తెలిపారు.

తక్షణ సహాయానికి సంప్రదించవలసిన నంబర్లు: 7993065999, 9032084999.

# ఎల్కతుర్తి మండల వడ్డెర సంఘానికి కొత్త నాయకత్వం

- అధ్యక్షుడిగా గొల్లెన ఎల్లయ్య ఏకగ్రీవంగా ఎంపిక

**ఎల్కతుర్తి, జూలై 19:(జనసముద్రం)**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల వడ్డెర సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో జరిగిన సంఘ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో కొత్త కమిటీని ప్రకటించి బాధ్యులకు నియామక



పత్రాలను అందజేశారు. మండల అధ్యక్షుడిగా దండేపల్లికి చెందిన గొల్లెన ఎల్లయ్యను ఎంపిక చేయగా, ప్రధాన కార్యదర్శిగా దామెరకు చెందిన అల్లెపు ప్రశాంత్, కోశాధికారిగా అల్లెపు రాజును నియమించారు. ఉపాధ్యక్షులుగా బొంత కుమారస్వామి, ఆలకుంట సమ్మయ్య, కార్యదర్శులుగా శివరాత్రి బిక్షపతి, గండికోట రాము, సహాయ కార్యదర్శులుగా వల్లపు సాంబరాజు, గండికోట జంపయ్య, ఎల్కతుర్తి పట్టణ అధ్యక్షుడిగా ఓర్సు కుమారస్వామి, మండల యూత్ ఇన్‌చార్జిగా బొంత అర్జున్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు మాట్లాడుతూ మండలంలోని వడ్డెరల ఐక్యత, అభివృద్ధి, హక్కుల పరిరక్షణ లక్ష్యంగా సమర్థవంతమైన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్య, ఉపాధి, గృహాలు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం వంటి అంశాల్లో వడ్డెరలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని కోరారు. సంఘం చాలా కాలంగా ప్రభుత్వానికి వినిపిస్తున్న న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర మహిళా గౌరవ అధ్యక్షురాలు శివరాత్రి రాజమ్మ, రాష్ట్ర కోశాధికారి గుర్రం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వల్లెపు సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సూర రవీందర్, జిల్లా కోశాధికారి వల్లెపు సాంబరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు వల్లపు సుధాకర్, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు వల్లపు రంజిత్ కుమార్, ధర్మసాగర్ మండల ఉపాధ్యక్షుడు వల్లపు వెంకన్నతో పాటు మండలంలోని పలు గ్రామాల వడ్డెర సంఘ ప్రతినిధులు, కుల పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

# పచ్చని పంట పొలాల్లో అక్రమ లే అవుట్లు

- మత్స్యపురి పెట్రోల్ బంక్ సమీపంలో రియల్ దందా జోరు
- ప్రభుత్వ ఆదాయనిక గండి
- అధికారుల పర్యవేక్షణ కరువు

**వీరవాసరం జూలై 19 జనసముద్రం ప్రతినిధి**

మత్స్యపురి పెట్రోల్ బంక్ సమీపంలోని పచ్చని వ్యవసాయ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ లే అవుట్లు వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ భూములను ఎలాంటి సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే ప్లాట్లుగా విభజించి విక్రయాలకు సిద్ధం చేస్తున్నట్లు



స్థానికులు పేర్కొంటున్నారు. అధికారిక అనుమతులు లేకుండా లే అవుట్లు అభివృద్ధి చేయడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోల్పోతుండటంతో పాటు భవిష్యత్తులో కొనుగోలుదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూములు వేగంగా రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారిపోవడం పర్యావరణానికి, వ్యవసాయ రంగానికి కూడా నష్టమని రైతులు అంటున్నారు. ఈ అక్రమ లే అవుట్లపై సంబంధిత అధికారులు



ఇప్పటికైనా స్పందించి, పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ లే అవుట్లకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు చర్యలు చేపడుతారా లేదా అనే అంశంపై వేచి చూడాలి.

# ఎస్సీ గురుకులపాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ల పంపిణ

**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ జులై 19.**

:అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలంలోని ఎస్సీ (బాలికల) గురుకుల పాఠశాలలో ఈరోజు 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర' కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎండి షఫీ నాయక్, విద్యార్థినులకు స్వయంగా కిట్లను అందజేశారు.





ఈ సందర్భంగా డాక్టర్ షఫీ నాయక్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కొనియాడారు. ఈ విద్యా సంవత్సరం నుండి ఏపీ వ్యాప్తంగా బాలికల వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థినుల సౌకర్యార్థం, గతంలో అందజేసే సామాగ్రితో పాటు అదనంగా నైట్ డ్రెస్ లు, తువాలు, మరియు స్వెట్టర్లను 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర' కిట్లలో చేర్చి అందించడం జరిగిందని వివరించారు. విద్యార్థినుల అవసరాలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యొక్క చిత్తశుద్ధిని, గొప్పతనాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.

తమకు అందిన ఈ కిట్ల పట్ల విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యా వాతావరణాన్ని మెరుగుపరిచేలా ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి నిర్ణయాలు విద్యార్థినులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ప్రిన్సిపాల్, అహ్మద్ అలీ, ఎస్ ముక్తార్, మల్లీ నాయుడు, పకీరయ్య, తుమ్మల మల్లికార్జున, షేక్ అమీర్ బాషా, అశోక్, బీజేపీ నాయకులు వెంకటరామరాజు, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రత్తి పంట పై యాజమాన్య పద్ధతులు గురించి వివరించిన సైంటిస్ట్ బి.సైదా నాయక్

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, జూలై 19;**

ప్రత్తి పంట పై యాజమాన్య పద్ధతులు గురించి వెల్దుర్తి మండలంలోని యర్రబాలెం గ్రామ రైతులకు సంగమేశ్వరపురం వ్యవసాయ విద్యాలయంలో పనిచేస్తున్న సైంటిస్టు బి.సైదా నాయక్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్తి పంటని బెట్ట నుండి ఏ విధంగా కాపాడుకోవాలి అనే విషయం పై రైతులకు సలహాలు ఇచ్చారు. అలాగే మొక్క ఏపుగా



పెరిగి, వాడిపోకుండా ఉండాలంటే మల్టీకే లేదా 19 లేదా 20 గ్రాములు యూరియా ఒక లీటర్ నీటిలో కలిపి మొక్కపై నుండి పిచికారి చేయడం వలన ఆకుల ద్వారా పోషకాలు లభించి మొక్క వాడు పోకుండా ఉంటుందని తెలిపారు. ఈ విధంగా బెట్ట నుండి మొక్కను కాపాడుకోవచ్చని సైంటిస్ట్ సైదా నాయక్ సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల వ్యవసాయ అధికారి మరియు ఎర్రబాలెం రైతులు నలబోతుల రవి, రాయంకుల లక్ష్మయ్య, పాటి బుజ్జోడు, ఆవుల అమరలింగయ్య, నలబోతుల చిన్న కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# మద్దిమడుగు శ్రీ పబ్బతి ఆంజినేయస్వామి ని దర్శించుకొన్న జనసైనికులు

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, జూలై 19;**



మాచర్ల నియోజకవర్గానికి చెందిన పలువురు జనసైనికులు తెలంగాణ రాష్ట్రం లోని మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్న మద్దిమడుగు శ్రీ పబ్బతి ఆంజినేయస్వామి ని దర్శించుకొన్నారు. వారిలో బూసా రామాంజనేయులు, వెల్దుర్తి మండల జనసేన అధ్యక్షులు గంధం మల్లయ్య పలువురు ఉన్నారు.

# శ్రీ నరసింహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథస్వామి.

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 19 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఉపాలయమైన లక్ష్మీపురం 'సంతానగోపాల శ్రీ జగన్నాథస్వామి' ఆలయంలో రథోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన ఆదివారం, స్వామి వారు భక్తులకు అత్యంత విశేషమైన 'శ్రీ నరసింహ అవతారం'లో దర్శనమిచ్చి కనువిందు చేశారు. ఈ సందర్భంగా జగన్నాథస్వామి వారు, తన సోదర సోదరీమణులైన బలభద్ర, సుభద్రలతో కలిసి కొలువుదీరి భక్తులకు భక్తానుగ్రహాన్ని ప్రసాదించారు. స్వామి వారి ఈ అద్భుత అవతారాన్ని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తజనంతో, గోవింద నామస్మరణతో మార్మోగిపోయింది.



శ్రీ నరసింహ అవతారంలో శ్రీ జగన్నాథ స్వామి.

# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

- సమీక్షా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఈ వి నాయుడు, ఉపాధ్యక్షులు ఎం.జయసింహ

**జనసముద్రంన్యూస్, జూలై 19;**





అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉంటామని,ఆరు నెలల్లో సమస్య పరిష్కారం చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రకటన ఊరట కలిగించిందని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం అధ్యక్షులు ఈ వి నాయుడు, ఉపాధ్యక్షులు ఎం.జయసింహ అన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి నెల సమీక్షా సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపిఐ నేత చాపరె వెంకటరమణ, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం జిల్లా అధ్యక్షులు గంగు శ్రీనివాస్ తదితరులు

# కన్నాపురం గ్రామ దేవతలకు ఆషాడ మాస బోనాల కావిడి మహోత్సవం

**జనసముద్రం న్యూస్, కొయ్యలగూడెం మండల రిపోర్టర్ ఈ.మనోహర్, జూలై 19,**

ఏలూరు జిల్లా, కొయ్యలగూడెం మండలం, కన్నాపురం గ్రామంలో గ్రామదేవతలైనటువంటి చల్లాలమ్మ తల్లికి గంగానమ్మ తల్లికి విజయలక్ష్మి కనకదుర్గ అమ్మవారి కి ఆషాడ మాసం సందర్భంగా గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆషాడ మాస సారెను సమర్పించారు. ఈ సందర్భంగా వర్షాలు సకాలంలో పడాలని పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని వృత్తి వ్యాపారాలు లాభాలలో నడవాలని, ప్రజలందరూ ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో సుఖశాంతులతో వర్ధిల్లాలని గ్రామదేవతలైన అమ్మవారు లను భక్తులు వేడుకున్నారు. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల పండుగ వాతావరణం తలపించే విధంగా బాణా సంచాలతో, కోలాట నృత్యాలతో,డప్పు వాయిద్యాలతో, కాళికా నృత్యాలతో, ఊరేగింపుగా గ్రామంలో ఉన్నటువంటి మూడు ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొడవర్తి ఈశ్వరచంద్ర విద్యాసాగర్ కన్నాపురం మాజీ సర్పంచ్ గొడవర్తి.వెంకటరత్నకుమారి, ఎంపీటీసీ గణపతి, కన్నాపురం గ్రామ ప్రజలు, బంధువులు , తదితరులు పాల్గొన్నారు.









# స్వార్థపరులు పార్టీని వీడితే వైఎస్సార్‌సీపీకి నష్టం లేదు: గడికోట శ్రీకాంత్ రెడ్డి

**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ జులై 19**

స్వార్థపరులు పార్టీని వీడితే వైఎస్సార్‌సీపీకి ఎలాంటి నష్టం లేదని, కష్టకాలంలో పార్టీని నమ్మి నిలిచిన కార్యకర్తలే అసలైన బలమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాజకీయాల్లో పార్టీలు మారడం గొప్ప విషయం కాదని, అధికారంలో ఉన్నప్పుడు ప్రజల కోసం చేసిన అభివృద్ధే నిజమైన కొలమానమని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలు, బీసీలు, మైనార్టీల సాధికారతకు జగన్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. పార్టీ ద్వారా



పదవులు, గౌరవాలు పొందిన కొందరు అధికారం లేకపోవడంతో పార్టీని వీడుతున్నారని, అలాంటి వారితో పార్టీ బలహీనపడదన్నారు. గ్రామస్థాయి నుంచి నిబద్ధత కలిగిన కొత్త నాయకత్వాన్ని తీర్చిదిద్దే శక్తి వైఎస్సార్‌సీపీకి ఉందని, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడమే రాజకీయాల అసలు లక్ష్యమని శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# అమడగూరు మాల మహానాడు అధ్యక్షునిగా లక్ష్మీనారాయణ ఎంపిక.

**జనసముద్రం న్యూస్ అమడగూరు 19/07/2026**

మండల పరిధిలోని స్థానిక శ్రీ చౌడేశ్వరి కళ్యాణ మండపంలో ఆదివారం నాడు ఏర్పాటు చేసిన మాల మహానాడు మండలం అధ్యక్ష ఎంపీగను జిల్లా మాల మహానాడు జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీ. సి గంగులయ్య జిల్లా అధ్యక్షులు ఎం ఎం మూర్తి జిల్లా కార్యదర్శి నేసే జానకిరామ్ నాయకుల ఆధ్వర్యంలో కొట్టువారిపల్లి పంచాయతీ కంచర వాండ్ల పల్లి గ్రామ నివాసి తెలుగు యువత గతంలో అనేక పదవులు చేపట్టిన యువ నాయకుడు మంచి పేరు ప్రఖ్యాతులుగాంచిన మంచి మనిషిగా గుర్తింపు పొందిన అందరికీ చేయూతనిచ్చే ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారమయ్యే విధంగా పట్టుదలతో చర్యలు తీసుకుంటున్న లక్ష్మీనారాయణను మండల అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు గతంలో ఆయన తమ కులాన్నికి చేసిన సేవలను గుర్తించి పలువురు ప్రశంసలు కురిపించారు భవిష్యత్తులో కూడా తమ కులానికి మంచి చేస్తాడని ముఖ్య ఉద్దేశంతో ఏక గ్రేవాంగ నిర్ణయం తీసుకుని ప్రతి ఒక్కరూ సంతోషంగా ప్రతి ఒక్కరూ ఎంపిక చేయడం జరిగింది మండల గౌరవ అధ్యక్షులుగా ఎస్ చలపతి ఉపాధ్యక్షులుగా పి మణికంఠ కార్యదర్శి చెంగలీ శ్రీనివాసులు సంయుక్త కార్యదర్శి ఎం నరసింహులు ఏ శ్రీనివాసులు ఎం ఆదినారాయణ పి రమణ సూర్యనారాయణ సహాయ కార్యదర్శులు రెడ్డప్ప విశ్వనాథ నారాయణస్వామి జి వెంకటరమణ చిరంజీవి ప్రసాదు పి ఆంజనేయులు తదితరులు ఎంపిక చేయడం జరిగింది

## మూడేళ్ల నుంచి పంటలు సంవృద్ధిగా పండాయి

### సీహెచ్. విజయరమణారావు, ప్రభుత్వ విప్

బీఆర్ఎస్ నేత హరీష్ రావు రోజు రోజుకు దిగజారిపోతున్నాడనీ వివరించారు బీఆర్ఎస్ పార్టీలో పట్టు నిలబెట్టుకోవడానికి నానా పాట్లు పడుతున్నాడురేవంత్ రెడ్డి పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తు బురదజల్లే ప్రయత్నం హరీష్ రావు చేస్తున్నాడు.రేవంత్ రెడ్డి వల్లనే కరువు వచ్చిందని హరీష్ రావు అబద్దాలు మాట్లాడుతున్నాడు..హరీష్ రావు రోజుకు 100 అబద్దాలు ఆడుతాడు.. అందులో భాగంగా ఈ రోజు రేవంత్ రెడ్డి పైన మరో అబద్ధం ఆడాడనీ ఆగ్రహం వ్యక్తం చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గత మూడేళ్ల నుంచి పంటలు సంవృద్ధిగా పండాయనీ రికార్డు స్థాయిలో పంటల దిగుబడులు వస్తున్నాయి. రైతుల్లో సీఎం రేవంత్ రెడ్డి పైన విషం నింపాలని హరీష్ రావు ప్రయత్నం చేస్తున్నాడనీ మండిపడ్డారు ఎప్పుడూ లేనంతగా పంట దిగుబడి వచ్చింది, వరి, మొక్కజొన్న, మిర్చి , పత్తి దిగుబడి బాగా వచ్చిందిసబ్సిడీపైన విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందిస్తున్నాం అని తెలిపారు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం 25 లక్షల మంది రైతులకు 20 వేల కోట్ల రుణమాఫీ చేశాం.వరి క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం. అని పేర్కొన్నారు మద్దతు ధరకు మార్కెఫెడ్ ద్వారా మక్కలు కొనుగోలు చేశాం. అని 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ను రైతులకు ఇచ్చాంకేటీఆర్ ను మించి పోవాలని హరీష్ రావు ఉద్దేశపూర్వకంగా రేవంత్ రెడ్డి పైన విమర్శలు చేస్తున్నాడనీ విమర్శించారు కేసీఆర్ కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయింది.నీళ్లు నిల్వ ఉంచరాదని ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చింది.. దాన్నే మా ప్రభుత్వం అనుసరిస్తోంది.. ఎల్ నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందనీ తెలిపారు వరి కు బదులు ఆరు తడి పంటలు వేసుకోవాలని ప్రభుత్వం రైతులకు చెపుతోంది.. రైతులకు నష్టం జరగొద్దని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన బురద జల్లే ప్రయత్నాలు హరీష్ రావు మానుకోవాలి. కేసీఆర్ హయాంలో పదేళ్లు కరువే రాలేదని పనికి పాలిన కబుర్లు చెపుతున్నాడు.బీఆర్ఎస్ హయాంలో 2014, 2015, 2019 సంవత్సరాల్లో వర్షాలు లేక వ్యవసాయం, తాగునీటి కి తీవ్ర సమస్యలు వచ్చాయన్నారు వరి వేస్తే ఉరేనన్నది కేసీఆర్.ఖమ్మంలో మిర్చి రైతులకు బేడీలు వేసింది కేసీఆర్. అని రైతులకు ఎరువులు ఉచితంగా ఇస్తానని కబుర్లు చెప్పి మోసం చేసింది కేసీఆర్.. రైతు బందు ఒక్కటే ఇచ్చి అన్ని రకాల సబ్సిడీలు ఎత్తివేసింది కేసీఆర్. అని తెలిపారు చెట్లు, పుట్టలు, సినిమా థియేటర్లు, చివరకు రోడ్లకు కూడా రైతు బంధు ఇచ్చి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసింది కేసీఆర్.. రైతులను సర్వనాశనం చేసిన చరిత్ర కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీది.. హరీష్ రావు దేవుళ్ల పేరు చెప్పి సిగ్గు లేకుండా తప్పుడు ప్రచారం చేస్తే ఆ దేవుడు నీకు తగిన శిక్ష విధిస్తాడన్నారు

## సంగారెడ్డి నియోజకవర్గం లో ఒక్క ఓటు మిస్ కావద్దు

### కాంగ్రెస్ బిఎల్ఏ లకు, నాయకులకు జగ్గారెడ్డి ,నిర్మల ఆదేశం సర్ ప్రక్రియ అమలు తీరు పై సమీక్షించేందుకు కాంగ్రెస్ బిఎల్ఏ లు, ముఖ్య నాయకులతో జగ్గారెడ్డి, నిర్మల అత్యవసర సమావేశం




సంగారెడ్డి నియోజకవర్గం లో అర్హులైన ఏ ఒక్కరి ఓటు మిస్ కాకుండా కాంగ్రెస్ బిఎల్వో లు, నాయకులు జాగ్రత్తలు తీసుకోవాలని జగ్గారెడ్డి ఆదేశించారు. గత నెల రోజులుగా అమలవుతున్న సర్ ప్రక్రియ పై ఆదివారం సంగారెడ్డి పట్టణం లోని క్లాసిక్ గార్డెన్స్ లో కాంగ్రెస్ బిఎల్ఏ లు, ముఖ్య నాయకులతో జగ్గారెడ్డి, నిర్మల అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. సర్ ప్రక్రియ కు ఇంకా పది రోజుల గడువు మాత్రమే ఉండటం తో ఆదివారం ఉదయం సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ ముఖ్య నేతలతో జూమ్ సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు.

ఈ నేపథ్యంలో సంగారెడ్డి లో ఆదివారం సాయంత్రం బిఎల్ఏలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. సంగారెడ్డి నియోజకవర్గం లోని 282 బిఎల్ఏ లతో ఒక్కొక్కరితో జగ్గారెడ్డి ముఖాముఖి గా మాట్లాడారు. ఇప్పటి కి ఎన్ని ఫారాలు పంపిణీ చేశారు, ఇచ్చిన ఫారాల్లో ఎన్ని తిరిగి వచ్చాయి, ఇంకా ఎన్ని రావాల్సి ఉంది అని అడిగి వారి నుండి సమాచారం తీసుకున్నారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఇంచార్జి మీనాక్షి నటరాజన్ లు సర్ ప్రక్రియ పై దిశా నిర్దేశం చేశారని, వారి ఆదేశాల మేరకు ప్రతీ ఒక్క బిఎల్ఏ లు స్వయంగా తమ వార్డు పరిధి లోని ప్రతీ ఇంటికి వెళ్ళాలని, ఏ ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా ప్రతీ ఓటు నమోదు జరిగేలా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు సంగారెడ్డి నియోజకవర్గం లో 66.67% ఓటరు నమోదు పూర్తయిందని, గడువు పది రోజులు ఉన్నప్పటికీ రానున్న ఐదు రోజుల్లో మొత్తం ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించారు. మూడు రోజుల తర్వాత మరొకసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తానని ఆలోపు దాదాపు పూర్తయ్యేలా పని చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, ఆత్మ చైర్మెన్ ప్రభు, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

### బోనాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం నిజామాబాద్ నగరంలోని అంబేద్కర్ కాలనీ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం మరియు కోటగల్లి కోట మైసమ్మ ఆలయంలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ప్రార్థించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రజల ఐక్యతకు ఈ వేడుకలు నిదర్శనమని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మహేష్ కుమార్ గౌడ్‌కు ఘన స్వాగతం పలికి అమ్మవారి ఆశీర్వచనంతో తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, కార్పొరేషన్ చైర్మన్లు శేఖర్ గౌడ్, తాహెర్బిన్, కేశ వేణు, కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మావుళ్ళమ్మ అమ్మవారి అనుగ్రహమే పట్టణాభివృద్ధికి మూలం

- ●జాతర ప్రారంభంలో మాట్లాడుతున్న
- ●ఎమ్మెల్యే అంజిబాబు





**భీమవరం జులై 19 జనసముద్రం ప్రతినిధి**

శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి అనుగ్రహమే భీమవరం పట్టణాభివృద్ధికి మూలమని, అమ్మవారి దయ సిరిసంపదలు వెల్లివిరుస్తాయని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలో 3వ వార్డులో ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి 34వ వార్షిక జాతర మహోత్సవాన్ని, 38వ వార్డు లంకపేటలో అమ్మవారి 11వ వార్షిక జాతర మహోత్సవాన్ని, 35వ వార్డు సూర్యనారాయణ పురం యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఎమ్మెల్యే అంజిబాబు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. వాడవాడలా అమ్మవార్ల జాతరను వారంవారం నిర్వహించడం శుభ పరిణామమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. కార్యక్రమంలో ఏపిఐఐసి డైరెక్టర్ చెనమల్ల చంద్రశేఖర్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండి షబీన బేగం, 3వ వార్డు ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు యాతం శ్రీనివాస్ , బ్రాహ్మజి , కాపా అమర్ బాబు, సర్వే సత్యనారాయతన, మద్దాల బ్రహ్మాజీ, వీర రాఘవులు, ముగ్గళ్ళ నాని, 35వ వార్డు యూత్ సభ్యులు కొప్పినిడి బాబీ, దేవర కుమార్, వెంకన్న, సత్యనారాయణ, నౌడూరి ప్రసాదు, వై శ్రీను, వీరన్న, మైనం కార్తీక్, చంద్రశేఖర్, దేవర గోపి, 38వ వార్డు లంకపేట సభ్యులు యండ మావుళ్లు, యండ సత్యవతి, రాంబాబు, రమాదేవి, యండ అప్పల సూరి, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే కోడూరులో ఇసుక మాఫియా రాజ్యం...!! 20 టన్నుల లారీలో 60 టన్నుల ఇసుక ...!! అధికారులకు లంచాల వరద..!?



**తిరుపతి జిల్లా ఇన్చార్జి న్యూస్ జూలై 19 జనసముద్రం న్యూస్**

రైల్వే కోడూరు నియోజకవర్గం నుండి ప్రతిరోజు వందలాది ఇసుక లారీలు అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నాయి. నిబంధనల ప్రకారం 20 టన్నుల సామర్థ్యం ఉన్న లారీల్లో 50 నుండి 60 టన్నుల ఇసుకను అధికంగా లోడ్ చేసి తరలిస్తున్నారు.

ఈ అక్రమ తరలింపు కోసం ఇసుక మాఫియా అధికారులకు భారీగా లంచాలు ఇచ్చి వారిని నిద్ర మత్తులో ఉంచుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు? లంచం మైకంలో మునిగి రోడ్లపై రాజ్యం ఏలుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

ఈ పరిస్థితిని చూసి ఆగ్రహించిన తెలుగు తమ్ముళ్లు పెద్దూరు వద్ద ఇసుక లారీలను అడ్డగించి నిరసన తెలిపారు. ప్రతిరోజు రైల్వేకోడూరు నుంచి వందలాది టన్నుల ఇసుక ఇలా అక్రమంగా తరలిపోతుండటంతో భవిష్యత్ తరాలకు ఇసుక కూడా మిగలదని ఆందోళన వ్యక్తం చేశారు.

అక్రమ ఇసుక తరలింపుపై తక్షణం చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు ఉండాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కుమ్మర్ల బోనాల పండుగ లో పాల్గొన్న డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

### అశాడ మాసం సందర్భంగా సంగారెడ్డి ఎఫ్అర్ఎస్ ఎల్లమ్మ కు తొలి బోనం సమర్పించిన కుమ్మర్లు

అశాడ మాసం సందర్భంగా సంగారెడ్డి పట్టణం లో బోనాల ఉత్సవాలు మొదలయ్యాయి. ఆనవాయితీగా ఎఫ్అర్ఎస్ ఎల్లమ్మ తల్లి కి కుమ్మర్లు తొలి బోనం సమర్పించారు. ఐబి నుండి మొదలుకుని ఎల్లమ్మ గుడి వరకు బోనాలను ఊరేగించారు. డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఈ బోనాల ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఆశాడమాసం అత్యంత పవిత్రమైన మాసం అన్నారు. ఆశాడ మాసం సందర్భంగా అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించడం తరతరాలుగా వస్తున్న ఆచారం అన్నారు.ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్ లు శైలేష్ రెడ్డి, కృష్ణ, అశ్విన్, కాంగ్రెస్ నాయకుడు శ్రీశైలం,

## విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ, ఆట సామాగ్రి అందజేసిన ఆరోగ్య వర్షిణీ ట్రస్ట్

**మొగల్తూరు జూలై 19 జనసముద్రం ప్రతినిధి**




మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య వర్షిణీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈరోజు విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి, ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ట్రస్ట్ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తూ విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కృష్ణా ప్రసన్న, విజయజ్యోతి. దొంగ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు రామరాజు పరామర్శ

**నరసాపురం జులై 19 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**



నరసాపురం నియోజకవర్గం నరసాపురం మండలం కొప్పరు గ్రామంలో ఇటీవల కాళం చేసిన లింగం ఆంజనేయులు, కడల శ్రీనివాసరావు, రావి రమేష్, వేంద్ర అప్పారావు పెద్ద కుమారుడు కుటుంబాలను నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబ పెద్దలను కోల్పోవడం ఎంతో బాధాకరమని పేర్కొంటూ, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ముక్కు బాబురావు, కడలి మసేను పొట్టూరి వెంకట శివయ్య, రామనాథం శ్రీనివాసు , నాగిడి రాంబాబు , తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద మృతుడి కుటుంబానికి రామరాజు పరామర్శ



మొగల్తూరు మండలం మొగల్తూరు గ్రామంలో ఆదర్శ నగర కాలనీకి చెందిన వాటాల నాగేంద్ర వర్మ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో మరణించినారు. వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పొత్తూరు రామరాజు వారి మోకా ఏడుకొండలు మత్స్యకార సొసైటీ అధ్యక్షులు నాగిడి రాంబాబు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు జక్కంశెట్టి ఏసుబాబు మొగల్తూరు మండలం తెలుగు యువత అధ్యక్షులు

## కొప్పర్రులో చెలరేగిపోతున్న మట్టి మాఫియా

### పట్టించుకోని అధికారులు.. స్థానికుల్లో ఆందోళన

**నరసాపురం జులై 19 జనసముద్రం ప్రతినిధి**



నరసాపురం మండలం కొప్పర్రు గ్రామం సరేపాలెం రహదారి లో అక్రమ మట్టి తవ్వకాలు, తరలింపు రోజురోజుకూ పెరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పగలు, రాత్రి



తేడా లేకుండా భారీ యంత్రాలతో మట్టిని తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. అక్రమ తవ్వకాల కారణంగా వ్యవసాయ భూములు దెబ్బతినడంతో పాటు పర్యావరణానికి కూడా నష్టం జరుగుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో గ్రామ రహదారులు దెబ్బతింటుండగా, దుమ్ము కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అక్రమ మట్టి తవ్వకాలపై వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, సహజ వనరులను కాపాడాలని స్థానికులు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## పేకాటరాయులకు చెక్ పెట్టిన మొగల్తూరు పోలీసులు

### ఐదుగురు పేకాట రాయుల్లు అరెస్ట్

**మొగల్తూరు, జూలై 19 జనసముద్రం ప్రతినిధి**

మొగల్తూరు శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై జి. వాసు తెలిపిన వివరాల ప్రకారం, పక్కా సమాచారంతో నిర్వహించిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.2,400 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా జూద కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఇలాంటి ప్రత్యేక దాడులు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. నరసాపురం రూరల్ మరియు టౌన్ ప్రాంతంలో జూద క్రీడలకు సంబందించి ఎటువంటి కేసులు నమోదు కాకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతునాయి.

## ఇదంతా అభిమానుల చలవే.. ప్రేమతో మీ ధనుష్!



72వ జాతీయ పురస్కారాలుధనుష్‌కు రెండింతల ఆనందాన్ని తీసుకొచ్చాయి. ఆయన దర్శకత్వంలో వచ్చిన 'రాయన్' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా (తమిళ) ఎంపికవడంతో పాటు.. 'కెప్టెన్ మిల్లర్')తో ధనుష్ స్పెషల్ మెన్షన్ (నటుడు) గౌరవాన్ని పొందిన సంగతి తెలిసిందే. దర్శకుడిగా జాతీయ స్థాయిలో తొలిసారి అవార్డును సొంతం చేసుకోవడం, నటుడిగా నాలుగోసారి జ్యూరీ గుర్తింపును పొందడంపై ధనుష్ ఆనందం వ్యక్తం చేశారు. ఎంపిక కమిటీకి, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఇన్‌స్టా పోస్టులో తన భావాలను ఇలా పంచుకున్నారు."ఓం నమశ్శివాయ..! జాతీయ పురస్కారాల్లో 'రాయన్' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపిక కావడంతో పాటు, 'కెప్టెన్ మిల్లర్'తో స్పెషల్ మెన్షన్(నటుడు) గుర్తింపు దక్కడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ సందర్భంగా జాతీయ చలనచిత్ర అవార్డుల జ్యూరీకి, ఎంపిక కమిటీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. కెరీర్ తొలినాళ్ల నుంచి మద్దతుగా నిలిచిన మీడియాకు ధన్యవాదాలు. నటుడిగా ఇది నాకు నాలుగో జాతీయ అవార్డు కాగా, దర్శకుడిగా మొట్టమొదటిది. నాకు ఇంత శక్తినిచ్చి, నా ఎదుగుదలకు మూలస్తంభాలుగా నిలిచిన నా అభిమానులే లేకపోతే ఇవేవీ సాధ్యమయ్యేవి కావు. అందుకు వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను" 'కెప్టెన్ మిల్లర్'కు వచ్చిన గుర్తింపు మరింత ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇప్పటివరకూ నేను అత్యుత్తమ నటన కనబర్చింది ఈ చిత్రంలోనే అని మొదటినుంచి బలంగా విశ్వసిస్తున్నాను. నా మనసుకు అంత దగ్గరైన పాత్రకు ఇప్పుడు స్పెషల్ మెన్షన్ గౌరవం దక్కడంతో ఈ విజయం మరింత అర్థవంతంగా మారింది. అలాగే మొదటి విజయం ఎప్పటికీ మర్చిపోలేనిది. 'రాయన్'తో దర్శకుడిగా దక్కిన తొలి జాతీయ పురస్కారాన్ని జీవితాంతం విలువైన జ్ఞాపకంగా దాచుకుంటాను. మన ఆలోచనలను బట్టే మన జీవితం ఉంటుందనే మాటను ప్రతిసారీ చెబుతుంటాను. ఈ సందర్భంలోనూ అదే మాటను గుర్తుచేసుకుంటున్నాను. హర్ హర్ మహాదేవ్! ప్రేమతో మీ ధనుష్" అని ఆయన తన ఆనందాన్ని పంచుకున్నారు.

# 'రామాయణ' చిత్రం

## భారతదేశం కల: యశ్



'రామాయణ' చిత్ర బృందం

"మన శ్రీరాముడి కథని.. గ్లోబల్ వేదికపై నిలబెట్టాలి.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు చూపించాలనే ఉద్దేశంతో చేసిన చిత్రమే 'రామాయణ" అన్నారు నటుడు, నిర్మాత యశ్. నితేశ్ తివారీ దర్శకత్వంలో ముస్తాబైన ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి నటించిన సంగతి తెలిసిందే. యశ్ ఇందులో రావణుడి పాత్రను పోషిస్తూనే.. నమిత్ మల్హోత్రాతో కలిసి స్వయంగా నిర్మించారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. 'రామాయణ: పార్ట్ 1' దీపావళి సందర్భంగా నవంబరులో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఈనెల 24న ట్రైలర్ విడుదల చేయనున్నారు. దీనిలో భాగంగా శనివారం దిల్లీలో ప్రథమ్ సంకల్ప్ పేరుతో వేడుకను నిర్వహించి.. ట్రైలర్‌ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. "ఇది కేవలం సినిమా కాదు. భారతదేశం కల. ఆ కలని నిజం చేయడం కోసం మేమంతా కలిశాం" అన్నారు నటుడు, నిర్మాత యశ్. ఈ కార్యక్రమంలో రణ్‌బీర్, సాయిపల్లవి, రకుల్ ప్రీత్ సింగ్, వివేక్ ఒబెరాయ్, సన్నీ దేఓల్, శోభన తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలోకి తిరిగి రావాలనే ఆలోచనే లేదు: ఐశ్వర్య



ప్రస్తుతం 'గట్టా కుస్తీ 2' విజయాన్ని ఆస్వాదిస్తున్న నటి ఐశ్వర్య లక్ష్మి వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ఇందులో బాలీవుడ్ ఎంట్రీ సహా రెండు వెబ్ సిరీస్‌లు, ఒక ఫిమేల్ లీడ్ తమిళ సినిమాలో నటిస్తున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఫెమినిజం, సోషల్ మీడియా, కామెడీ, తన రాబోయే చిత్రాల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు."గట్టా కుస్తీ 2' సినిమా బాక్సాఫీస్ కలెక్షన్ల వివరాలను ఎప్పటికప్పుడు నా టీమ్ తెలియజేస్తూ ఉంటుంది. వీటికన్నా కూడా ప్రేక్షకులు సినిమా ఆస్వాదించడమే నాకు అసలైన సంతృప్తి. థియేటర్లలో వారు నవ్వుతుంటే అదే మాకు ఆనందం. దాని కోసమే కదా మేం కష్టపడేది. 'గట్టా కుస్తీ 2' చక్కటి వినోదాన్ని పంచుతూనే స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఒక మహిళ తన కలలను సాకారం చేసుకోవడానికి పురుషుడు ఏవిధంగా వెన్నంటి నిలిచాడన్నది ఈ చిత్ర కథాంశం. ప్రియాంక చోప్రానే తీసుకోండి.. భర్త నిక్ జోన్స్ ప్రతి విషయంలో ఆమెకు అండగా ఉంటాడు. మా మూవీ కూడా ఇదే చెబుతుంది""నాకు సినిమాల్లో కామెడీ సన్నివేశాలు చేయడం ఇష్టం. కానీ, కామెడీ పండించడంలో నేను ఇంకా మెరుగుపడాలి. ఇప్పటివరకూ నేనెప్పుడూ సోషల్ మీడియాలో సురక్షితంగా ఉన్నట్లు అనిపించలేదు. అది లేకుండా పని చేయడం చాలా సులభం. ప్రస్తుతం సోషల్ మీడియాలోకి తిరిగి రావాలనే ఆలోచనే లేదు. గతంలో నా ఫొటోలను మార్ఫ్ చేయడం, కామెంట్లు పెట్టడం వల్ల అందరూ నన్ను ద్వేషిస్తున్నట్టు అనిపించేది. ఇప్పుడు ప్రజలను నేరుగా కలవడం సంతోషంగా ఉంది. రోజుకు రూ.100 కోట్లు ఇచ్చినా సోషల్ మీడియా దరిదాపుల్లోకి వెళ్లను. నా డాగ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా మాత్రమే వార్తలు, సినిమా అప్‌డేట్స్ చూస్తాను" అని ఐశ్వర్య పేర్కొన్నారు. ప్రస్తుతం ఐశ్వర్య ఆనంద్ దర్శకత్వంలో ఒక ఫిమేల్ సెంట్రిక్ తమిళ సినిమాలో పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. తర్వాత 'తీవినయ్ పొట్రు', 'లవ్' అనే రెండు వెబ్ సిరీస్‌లు ఐశ్వర్య లక్ష్మి ఖాతాలో ఉన్నాయి. బాలీవుడ్‌లో కూడా ఆమె ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా రాలేదు.

## పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశమే



ఓ నాయికగా గ్లామర్ కంటే కథకు, వైవిధ్యమైన పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చే తక్కువమంది నాయికల్లో యామీ గౌతమ్ ఒకరు. నాయికా ప్రాధాన్య చిత్రాల్లో సత్తా చాటే ఈ తార 'ఆర్టికల్ 370'లో పోషించిన ఇంటెలిజెన్స్ అధికారిణి జూనీ హక్సర్ పాత్రతో మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ పాత్రే ఆమెని జాతీయ ఉత్తమ నటిగా నిలబెట్టింది. జమ్మూకశ్మీర్‌లోని ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన అత్యంత కీలకమైన ఆపరేషన్‌లో ఇంటెలిజెన్స్ అధికారిణిగా దేశభక్తిని చాటుతూ.. భావోద్వేగమైన సందర్భాలలో కూడా పాత్రలో గంభీరతని ప్రదర్శించి, ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలతో సినీప్రియుల్ని ఆకట్టుకున్నారు. నిశ్శబ్ద సన్నివేశాల్లో కళ్లతోనే కట్టిపడేశారామె. 'నేను ఎంచుకునే సినిమాలు ప్రస్తుత సంఘటనలతో ముడిపడి ఉంటున్నాయేమో అందుకే సామాజిక మాధ్యమాల్లో నన్ను విమర్శిస్తున్నారు'అని చెప్పే యామీ ఇటీవలే 'హక్' చిత్రంలో షాజియా పాత్రలో కనిపించి తన నటనతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. ఆమె ఎక్కువగా సీరియస్ పాత్రల్నే పోషిస్తుందని అనుకుంటున్న సమయంలో 'బాల' చిత్రంతో నవ్వులు పూయించిన నాయిక ఈమె. పాత్ర ఏదైనా కానీ అందులోకి పరకాయ ప్రవేశం చేయడమే యామికి తెలుసంటూ అందరిచేత ప్రశంసలు అందుకునే ఈ నాయిక ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉంది.

## కొత్త అనుభూతినిచ్చే థ్రిల్లర్..

# న్యూటన్స్ థర్డ్ లా



"ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించే థ్రిల్లర్ సినిమా 'న్యూటన్స్ థర్డ్ లా" అన్నారు హీరో సుమంత్. ఈ చిత్రంపై తామంతా ఎంతో నమ్మకంగా ఉన్నామని.. ఇది కచ్చితంగా అందర్నీ మెప్పిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'అనగనగా' విజయం తర్వాత ఈటీవీ విన్ సంస్థలో సుమంత్ చేసిన కొత్త చిత్రమే 'న్యూటన్స్ థర్డ్ లా'. రాజేశ్ కర్ణ దర్శకత్వం వహించారు. కె.హరీశ్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 31న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్రం నుంచి "ధమ్ ధమ్.." అనే పాటని విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో సుమంత్ మాట్లాడుతూ.. "ఈ స్క్రిప్ట్ విన్న వెంటనే దీంట్లోని వినయ్, కార్తీక్ పాత్రలు చాలా బలంగా ఉండాలని చెప్పా. ఆ రెండు పాత్రలు అద్భుతంగా వస్తే సినిమా ఆడుతుందని చెప్పా. ఇప్పుడు విడుదలైన పాట ఆ రెండు పాత్రలపైనే ఉంటుంది. ఈ సినిమాలో ప్రతి పాత్రకీ చాలా ప్రాధాన్యత ఉంటుంది. 'అనగనగా'కి బెస్ట్ యాక్టర్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా ఈటీవీ విన్‌కి ధన్యవాదాలు" అన్నారు. "ఇకపై థ్రిల్లర్ జానర్ గురించి మాట్లాడినప్పుడల్లా ఈ సినిమా పేరు తప్పకుండా వినిపిస్తుంది" అన్నారు దర్శకుడు రాజేశ్ కర్ణ. ఈటీవీ విన్ సాయికృష్ణ మాట్లాడుతూ.. "సుమంత్‌తో మా ప్రయాణం 'అనగనగా'తో మొదలైంది. ఇప్పుడీ సినిమాతో మా జైత్రయాత్రని కొనసాగిస్తామని నమ్ముతున్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో సింజిత్ యర్రమిల్లి, కె హరీశ్, కృష్ణ చైతన్య, వేదవ్యాస్, గౌతమ్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.